క్లుప్తంగా

‘ఆదర్శ’లో స్వాగతోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం స్వాగతోత్సవం(ఫ్రెషర్స్ డే) నిర్వహించారు. ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా విద్యార్థుల నృత్యాలు, నాటికలు, గేమ్‌షోలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ

కుంటాల: మండలంలోని ఓలా జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు తాటి సోమేశ్వర్ మంగళవారం 60 మంది విద్యార్థులకు టై, బెల్టులు ప్రదానం చేశారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్‌కుమార్, మాజీ సర్పంచ్ కనీస్ ఫాతిమా, మాజీ ఎంపీటీసీలు కట్ట రవి, పసుల నవీన్, ఏఏపీసీ చైర్మన్ నిరంజని, ఉపాధ్యాయులు శ్రీనివాసచారి, రవీందర్, గంగాధర్‌రావు, విజయ్‌కుమార్, భరత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు



చదును చేయిస్తున్న నాగభూషణం

సాక్షి స్పందన

కుంటాల: మండల పరిషత్ కార్యాలయ ఆవరణ ఇటీవలి వర్షాలకు బురదమయంగా మారింది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై బురద ఇలా.. వెళ్లేదెలా? శీర్షికన సాక్షిలో ఈనెల 5న కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. మంగళవారం ఎంపీడీవో ఎంఏ రహీం, పీఏసీఎస్ కార్యదర్శి నాగభూషణం కార్యాలయాలకు వెళ్లే దారిలో మొరం పోయించి ట్రాక్టర్‌తో చదును చేయించారు.

దరఖాస్తుల స్వీకరణ

కుంటాల: మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రుణమాఫీకి సంబంధించి బ్యాంకు ఖాతా, ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాల్లో పేర్లు, రేషన్‌కార్డుల్లో కుటుంబసభ్యుల వివరాలను సవరణ చేసేందుకు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో భైంసా ఏడీఏ వీణ, ఏఈవోలు గణేశ్, మహేశ్, ప్రగతి, రైతులు ఉన్నారు.

నిధులు కేటాయించాలని వినతి



ఎంపీ నగేశ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎంపీ నగేశ్‌ను బీజేపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్‌లో ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు నాగుల రాజుకుమార్, బీజేపీ నాయకులు శనిగారపు అఖిల్ విన్నవించగా సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ



భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీవో సమద్

తానూరు: మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలను ఎంపీడీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించి ప్రధానోపాధ్యాయుడు మురళికి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల హాజరు పరిశీలించి.. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వారి వెంట సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాఠశాలకు చేయూత

కుభీర్: మండలంలోని నిగ్వా పాఠశాలలో 80 మంది విద్యార్థులకు జాదవ్ దేవ్‌రావ్ సేవా సంస్థ తరఫున భైంసాలోని జేడీఆర్ ఆసుపత్రి డాక్టర్ జాదవ్ అనిల్‌కుమార్ టై బెల్టు, ఐడీ కార్డులను పంపిణీ చేశారు. పద్మ మెమోరియల్ తరపున గంగాప్రసాద్ పాఠశాలకు సౌండ్‌సిస్టం అందజేశారు. గ్రామానికే చెందిన ఆర్‌ఎస్సై సూర్యదాస్ తన వంతుగా ఫ్యాను, నాలుగు కుర్చీలను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు విజయ్, పాఠశాల చైర్మన్ లక్ష్మీ, మాజీ ఎంపీటీసీ దొంతుల దేవిదాస్, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి నాగభూషణ్, విశ్రాంత ఉపాధ్యాయుడు గోపాల్‌కిషన్ తదితరులు ఉన్నారు.

ఏం కొనేటట్టు లేదు..



ముథోల్ మార్కెట్‌లో కూరగాయలు కొంటున్న ప్రజలు

- భగ్గుమంటున్న కూరగాయల ధరలు
- తగ్గిన దిగుబడి.. పెరిగిన దిగుమతి
- అల్లాడుతున్న సామాన్యులు

ముథోల్: కూరగాయల ధరలు అమాంతం పెరగడంతో వినియోగదారులు కొనేందుకు అల్లాడుతున్నారు. మొన్నటివరకు కొందరు రైతులు కూలీల ఖర్చులు గిట్టుబాటు కాక పంటను చేన్లలోనే వదిలేశారు. ఇప్పుడు కూరగాయల ధరలు ఆకాన్నంటుతున్నా.. దిగుబడి రావడం లేదని వాపోతున్నారు. జి పట్టణాలు, గ్రామాల్లో జరిగే వారసంతల్లో మరో చోటు నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. దీంతో డిమాండ్ ఎక్కువ ఉండటంతో సాధారణంగానే ధరలు పెరుగుతున్నాయి.

జిల్లా అవసరాలకు సరిపోని కూరగాయలు..

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సాగవుతున్న కూరగాయలు జిల్లా ప్రజల అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. ఉమ్మడి జిల్లాలో 13,500 ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తేనే ప్రజల అవసరాలకు సరిపోతాయి. మార్కెట్‌లోనూ ధరలు స్థిరంగా ఉంటాయి. కానీ ప్రతికూల వాతావరణం కారణంగా 3 వేల నుంచి 7 వేల ఎకరాలకు మించి సాగు కావడం లేదు. 30 నుంచి 79 శాతం వరకు కూరగాయలను ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీంతో కూరగాయలు రవాణాలో చెడిపోవడం, స్థానికంగా నిల్వతో ధరలు అమాంతం పెరగడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. మొన్నటి వరకు కిలో కూరగాయలు కొన్న కుటుంబం.. ఇప్పుడు పావుకిలోతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి రైతు కొద్ది విస్తీర్ణంలోనైనా కూరగాయలు సాగు చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మొన్నటి వరకు కిలో వంకాయ రూ.50 పలకగా.. ఇప్పుడు వంద దాటింది. ప్రభుత్వం సైతం కూరగాయల విత్తనాలు రాయితీపై ఇవ్వాలి. దీంతో సాగు చేసేందుకు రైతులు ముందుకొస్తారు.

ముథోల్ మార్కెట్‌లో..

ముథోల్ మార్కెట్‌లో కూరగాయల రేట్లు కిలోకు ఈ విధంగా ఉన్నాయి. వంకాయ, కాకరకాయ, చిక్కుడుకాయ, క్యాప్సికమ్, బీరకాయ, మిర్చి రూ.120, బెండకాయ, ఆలుగడ్డ రూ.90, దొండకాయ రూ.70, ఆకుగోబి రూ.45, పువ్వుగోబి రూ.55, టమాట రూ.50 ఒక పుల్లకూర కట్ట రూ.20కిగా ఉన్నాయి.

అంగట్లో అన్నీ పిరమే..



అంగట్లో కూరగాయలు పిరమయ్యాయి. ఏది కొందామన్న ధైర్యం రావడం లేదు. గతంలో కిలో కొంటే ఇప్పుడు సగం కొంటున్నాం. ధరలు తగ్గితేనే కూరగాయలు తినే అవకాశం ఉంటుంది.
– తయారొద్దీన్, తరోడా

ఐదు నూర్లు తీసుకుపోతే..



అంగట్లకు పోతే ఐదు నూర్లు తీసుకుపోతేనే కూరగాయలు వారానికి సరిపడ వస్తున్నాయి. అన్ని పావుకిలోనే కొంటున్నాం. ధరలు గిట్టుంటే బతుకులు భారం అవుతున్నాయి.
– లక్ష్మి, ముథోల్

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



సోన్‌లో జెండాలతో బీజేపీ నాయకులు

భైంసాటౌన్: పట్టణ బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌ఎస్ కాటన్ నుంచి నిర్మల్ చౌరస్తా వరకు బైక్‌లపై ర్యాలీ తీశారు. అనంతరం శివాజీ చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో నాయకులు బాజీరావు, పోశెట్టి, కౌన్సిలర్ గౌతం, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికీ జెండాల పంపిణీ

సోన్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతోపాటు న్యూవెల్మల్, బొప్పారం గ్రామాల్లో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ జాతీయ జెండాలు పంపిణీ చేశారు. ప్రధాని మోడీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు సరికెల గంగన్న, దేశెట్టి నరేశ్, అంకుల్ నాగయ్య, బీజీ రెడ్డి, మేకల అశోక్, మార గంగారెడ్డి, ముత్యపల్లి నరేశ్, శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, పోశెట్టి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక గీతాలాపన

ఖానాపూర్: పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మంగళవారం సామూహిక జనగణమన గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నాయిని సంతోష్, టేకు ప్రకాశ్, కొండవేని రమేశ్, దాసరి శ్రీనివాస్, కిషన్‌రెడ్డి, మదిరె శ్రీనివాస్, పడాల రాజశేఖర్, గోపాల్‌రెడ్డి, భూమన్న, సత్యవతి, ఉపేందర్, స్వామి తదితరులు ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

భైంసాటౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. నిర్మల్ చౌరస్తా నుంచి ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. విద్యాశాఖకు మంత్రిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పవార్ కిరణ్, నాయకులు రాజారాం, మనీశ్, రుద్రప్రతాప్, విద్యార్థులు పాల్గొన్నారు.

‘బీజేపీ విమర్శలు సరికాదు’

ముథోల్: బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీపై చేస్తున్న విమర్శలు సరికాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ముథోల్‌లో విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపటేల్ నియోజకవర్గానికి చేస్తున్న అభివృద్ధిని చూసి బీజేపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని పేర్కొన్నారు. అందుకే అధికార కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతారెడ్డి, కిషన్, అజీజ్ ఉన్నారు.

ప్రశాంతంగా బంద్



లక్ష్మణచాందలో మూసి ఉన్న దుకాణాలు



కుంటాలలో ర్యాలీ తీస్తున్న నాయికులు

లక్ష్మణచాంద: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడిని నిరసిస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన మండల బంద్ విజయవంతమైంది. ఉదయం నుంచే గ్రామాల్లో వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. హిందూ సంఘాల నాయకులు పాఠశాలలు, కళాశాలలను మూసి వేయించారు.

సారంగపూర్: మండలంలో చేపట్టిన ప్రశాంతంగా ముగిసింది. పాఠశాలలతోపాటు వివిధ వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. సామాజిక కార్యకర్తలు రాజన్న, ప్రశాంత్, వివిధ సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

కుంటాలలో కొవ్వొత్తుల ర్యాలీ

కుంటాల: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ మంగళవారం రాత్రి కుంటాలలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేటి బంద్‌కు మద్దతు..

పెంబి: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా బుధవారం నిర్వహించే మండల బంద్‌కు వ్యాపారులు మద్దతు ప్రకటించారు.

తనిఖీ చేస్తూ.. ఆదేశిస్తూ

- ఖానాపూర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే బొజ్జు
- ఆసుపత్రి, హాస్టల్ నిర్వహణ తీరుపై ఆగ్రహం
- పద్ధతి మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక



ఎంజేపీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రితోపాటు మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందిని హడలెత్తించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ సమయంలో డైట్ మెనూ నాసిరకంగా ఉందని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి పరిసరాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అపరిశుభ్రత నెలకొందని పలువురు రోగులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.ఆస్పత్రిలో ఇటీవల కాలం చెల్లిన మందుల సరఫరా సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూస్తామన్నారు. ఆస్పత్రిలో డిజిటల్ ఎక్స్‌రేతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందిస్తామని పేర్కొన్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి..

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే నిర్వాహకులను ఆదేశించారు. జేకే నగర్‌లోని మహాత్మా జ్యోతి బాపూలే బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి హాస్టల్ నిర్వహణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా విద్యార్థులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. గదుల్లో సక్రమంగా ఫ్యాన్లు, వీధిదీపాలు లేకపోవడంతోపాటు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేశ్, నాయకులు సత్యం, గంగనర్సయ్య, శ్రీనివాస్, అమనుల్లాఖాన్, జహీర్ అహ్మద్, షౌకత్ పాషా, రాజన్న, శంకర్ తదితరులు ఉన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి



సోన్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖానాపూర్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు, సిబ్బంది గ్రామాల్లో చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి బాబురావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించగా ఆయన మాట్లాడారు. డ్రెయినేజీల్లో పూడిక తీయించడంతోపాటు బ్లీచింగ్ పౌడర్ చల్లించి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని పేర్కొన్నారు. తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో సునీత, ఎంపీవో చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

సోన్: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సురేశ్ మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. సోన్ పీహెచ్‌సీ వైద్యాధికారి వైష్ణవి, న్యూవెల్మల్ బొప్పారం వైద్యాధికారి శ్యాంకుమార్ మాట్లాడుతూ వారంలో రెండు సార్లు డ్రై డే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ సత్యనారాయణ, సూపర్‌వైజర్ స్వాతి, ఆశాకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

తానూరు: నిల్వనీటిని పారబోయాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ అన్నారు. మంగళవారం డ్రై డేలో భాగంగా తానూరులో ఎంపీడీవో పర్యటించారు. మురికికాల్వలను శుభ్రపరిచి నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రోజు పంచాయతీ ట్రాక్టర్ ద్వారా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి జలంసింగ్, ఆశా కార్యకర్తలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు



సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడమే పీఆర్టీయూ లక్ష్యమని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు లేకపోవడంతో విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు తగ్గిపోతున్నాయని అన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులను ఒకే సర్వీసు రూల్ కిందకు తేవాలని పేర్కొన్నారు. ఎంఈవో-1, ఎంఈవో-2, డైట్ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ పోస్టులను అర్హత కల్గిన ఉపాధ్యాయుల ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. హరిప్రసాద్, హరిహరనాథ్, శంకర్ తదితరులున్నారు.

బస్‌పాసుల పంపిణీ



పంపిణీ చేస్తున్న నాయకులు

కుభీర్: మండలంలోని పల్సి గ్రామంలోని కాశీవిశ్వనాథ మందిరంలో మంగళవారం 25 మంది దివ్యాంగులకు రాయితీపై బస్‌పాసులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆర్టీసీ అధికారి సుధాకర్, మాజీ సర్పంచ్ కె.హన్మండ్లు, నాయకులు రాందాస్, కె.గంగాధర్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండలకేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం 22 మంది దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఫిజియోథెరపిస్టు శ్రీనివాస్, ఐఆర్‌టీ భూమన్న, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

హిందూ ఉత్సవ సమితి కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

భైంసాటౌన్: పట్టణంలోని నర్సింహ కల్యాణ మండపంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో మంగళవారం హిందూ ఉత్సవ సమితి మహిష నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మహిష అధ్యక్షుడిగా పెండెపు కాశీనాథ్, ప్రధాన కార్యదర్శిగా కపిల్, కోశాధికారిగా దత్తాత్రి, సహ కోశాధికారిగా సక్కెర శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కుంట రాజలింగు, తోట విజయ్, చందులాల్, తోట రాము, లంక గంగాధర్, సహ కార్యదర్శులుగా చింతపండు మహేశ్, కనికరం శ్రీనివాస్, సుభాశ్, శివకుమార్, సలహా సభ్యులు, న్యాయ సలహాదారులు, సాంస్కృతిక కార్యక్రమాల అధ్యక్షులు, సభ్యులు, మీడియా ఇన్‌చార్జులు, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శంకర్, విలాస్ గాదేవార్, రామకృష్ణ గౌడ్, సాదుల కృష్ణదాస్ ఉన్నారు.

‘మత్తు’ దుష్ప్రభావాలపై అవగాహన



ముథోల్: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ముథోల్: నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ముథోల్ జెడ్పీ బాలికల పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం గీత మాట్లాడుతూ మత్తుతో కలిగే అనర్థాలను, శారీరక, మానసిక, సామాజిక సమస్యలను వివరించారు. ఉపాధ్యాయులు కవిత, స్వర్ణలత, నీరజ, అర్జున్, కవిత, గంగాధర్ పాల్గొన్నారు.

సోన్: దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని మండలంలోని పాక్‌పట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకన్న అన్నారు. నషాముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాఠశాలలో మత్తు పదార్థాలతో కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికాంత్, చంద్రశేఖర్ రావు, కృష్ణరావు, బలిరాం, అరుణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కుంటాల: మహిళలు పొదుపు చేసి ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం అశోక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సూర్యాపూర్‌లో నిర్వహించిన గ్రా మ సమాఖ్య సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, సీసీ యూసుఫ్, వీవోఏ మహేశ్ పాల్గొన్నారు. అనంతరం సూ ర్యాపూర్ గ్రామ సమాఖ్య సంఘ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సిందె సంగీత, కార్యదర్శిగా కదం లక్ష్మి, కోశాధికారిగా రొడ్డ సావిత్ర, ఉపాధ్యక్షురాలిగా రొడ్డ శ్రీలత, సహాయ కార్యదర్శిగా రొడ్డ పోసాని ఎన్నికయ్యారు.

బీపీఎంకు ఉత్తమ సేవా పురస్కారం

దస్తురాబాద్: మండల కేంద్రానికి చెందిన తపాలాశాఖ బీపీఎం శ్రీనివాస్‌కు మంగళవారం జిల్లా కేంద్రంలో ఉత్తమ సేవా పురస్కారం అందించారు. తపాలశాఖ పరిధిలో శ్రీనివాస్ అత్యధికంగా ఆర్డీలు చేయించటంతో పురస్కారానికి ఎంపికైనట్లు ఆ శాఖాధికారులు సిద్దార్థ, సందీప్ పేర్కొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్‌లో హనుమాన్ ఆలయం నుంచి బీరప్ప ఆలయం వరకు రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడేవారు. మంగళవారం అదే గ్రామానికి చెందిన గీర్మాయి చిన్నదేవన్న సొంతంగా రూ.10వేలు ఖర్చు చేసి మొరం పోయించి చదును చేయించారు. దీంతో గ్రామస్తులు చిన్నదేవన్నను అభినందించి ఘనంగా సన్మానించారు.

సన్మానం

ముథోల్: మండల కేంద్రంలో ఏడేళ్లు ఐసీడీఎస్ సీడీపీవోగా పని చేసిన శ్రీమతి కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. మంగళవారం కార్యాలయ సిబ్బంది ప్రస్తుత సీడీపీవో సరోజిని, ముథోల్, తానూరు, బాసర, లోకేశ్వరం, మండలాల అంగన్‌వాడీ టీచర్లు ఆమెను సన్మానించారు. యూడీసీ విజయ్, న్యాయూడీసీ శ్రీనివాస్, సూపర్‌వైజర్ శారద, శ్రీలక్ష్మీ, అనిత, మీనా, ఉమ, బీసీ రోజా తదితరులున్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బల్సా గజ్జారాం, బలిరాం బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో వారిని సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు బీవీ రమణరావు, గోపాల్, గజ్జారాం, ఉపాధ్యాయులు ఉన్నారు.